# పారిజాతం

వి. అశ్వినికుమార్

***మీరు కూడా నాతోబాటు ఈ వంతెన దగ్గర బస్సు దిగండి! కింద నిండుగా కదిలే కాలవ చూడండి ఒక్క నిమిషం! నీటిపై నుండి విసురుగా వస్తున్న గాలి వినండి! నీటిలో మెరుస్తున్న బంగారం చూడండి! పడమటాకాశంలో దూరంగా పడకటింటికెళ్లిపోతున్న పొద్దు చూడండి!***

కాలవ గట్లకు కాపలాకాస్తున్న మామిడి చెట్ల ధీమా చూడండి!

ఇప్పుడు- ఈ వాలులోంచి కిందకి, గట్టుమీదికి జాగ్రత్తగా దిగుదాం. ఒక్కసారిగా ఊపు వస్తుంది. నడక పరుగులా మారిపోతుంది- తూలకుండా దిగాలి. మరి- ఆ ఇప్పుడు- కాలవ నీళ్ళు కలకల వినపడుతుంది. వళ్లంతా బంగారం చేసుకొని పరుగులు పెట్టే నీళ్లు- గట్లకు తన్ని వరుసుకుంటున్న నీళ్లు- ఎన్ని నీళ్లు! ఎక్కడికీ పరుగులు? నురగలు!

చెట్లపై చేరుతున్న పక్షుల కలకలలు. ఈ కాలవ గట్టు దారే మా వూరు చేరుస్తుంది!

ఎక్కడ వంకరలేని కాలవ- అటు ఇటు చెట్ల తలలు కలిసిపోతున్నట్లు- నీటిపైకి కొమ్మలు-

ఆ మధ్యలో నుంచి- దూరంగా చూడండి-

ఓ తెరచాప- రాదారి పడవ- మనవేపే వస్తుంది.

తెరచాప నిండా గాలి నింపుకుని, వెనకనే పొద్దు వెలుగు దాచుకుని బద్ధకంగా, వయ్యారంగా కదులుతూంది. దగ్గరయ్యే కొలదీ పక్షుల కిలకిలతోపాటు ఏదో పాట కూడా వినపడుతుంది.

మెల్లగా- మెలమెల్లగా మనల్ని దాటి వెళ్లిపోతుంది- పడవ కదలికతో అలలు ఒడ్డుకు తగులుతాయి- జవరాలి కాలి అందెలు మోగినట్లు!

అంతలోనే ఊరు దగ్గరవుతుంది- సాయంత్రం పొగ కాలవ నీటి మీద వేలాడుతుంటుంది. ఊళ్లో అన్ని పొయ్యిలు పిడకలతో అంటుకుని వుంటాయి!

ఇక్కడే కాలవ గట్టు దిగి ఊరి దారి పట్టాలి. మెత్తటి ఇసక, చవిటి ఇసక! ఇళ్లకెళ్లుతున్న ఎడ్లబళ్లు- చక్రాలు మెత్తగా ఇసకలో తిరుగుతూ- ఎప్పుడో తిన్నగడ్డి నెమరేస్తూ తెల్లని నురుగులు కక్కుతూ- బలిసిన ఎద్దులు!

పగలంతా పనిచేసినా అలసిపోని ఆసాములు- పలకరింపులు వలుకులు దాటి, హరిజనవాడ దాటి, గవళ్ల ఇళ్లు దాటి ఎండు చేపల ఘాటువాసనలో నుంచి కోమటి అరుగులు దాటి, మున్సబు దొడ్డి దాటి పెద్ద అరుగుల వెంకయ్య మామ ఇంటి తర్వాత- మా యింటికి సన్న సందులో తిరిగాను.

దూరంగా రామాలయంలో నూనె దీపం కనపడుతోంది. అప్పటికే చెరువు, చీకటి కప్పుకుంది!

ఇంటర్ పరీక్షలు రాసి ఈరోజే బాబాయి ఇంటికి వచ్చాను. మా పిన్ని కూతురు తారక్క. "పరీక్షలు బాగా రాశావా" అని అడిగి 'కొత్త సినిమా మాయాబజార్ చూశావా?' అంది. నేను 'ఆ...' అంటుండగానే-

"నరసయ్య మామ రెండో పెళ్లి చేసుకున్నాడు" అని చెప్పింది. రాత్రి బాబాయితో పొలం పనులు గురించి అడిగితే "ఆకుమళ్లకు అరక కట్టాలి". అని పని పురమాయించాడు మర్నాటి నుంచి! మా ఉమ్మడి కుటుంబం వ్యవసాయం అంతా బాబాయే చూస్తుంటాడు. అన్ని శలవలకూ బాబాయి ఇంట్లోనే వుండి వ్యవసాయం పనుల్లో సాయం చేయటం అలవాటు.

** ** **

మర్నాడు నరసయ్య మామ ఇంటికెళ్లా, తారక్కతో...

(అప్పుడే చూశా, చిన్నత్తను...)

ఆమె... ఎక్కడ నుంచి దిగి వచ్చింది, ఇక్కడకు?


ఆ ముఖంలో ముందుగా ఆకట్టుకొనేవి ఆ కనులు!

నీలపు కలువరేకుల పెద్దపెద్ద రెప్పలు ఏదో బరువుతో వాలిపోతూ...

తెల్లని కనుగుడ్లు. నల్లని కనుపాపలు- సగం రెప్పల చాటునే... ఈ ప్రపంచానికి తన రహస్యం తెలియని వ్వని చీకటి పాపల్లో రెండు వెలుగు చుక్కలు!

విలాసంగా వంగిన కనుబొమ్మలు... మధ్యలో అస్తమించే పొద్దులా కుంకుమ బొట్టు!

ఎవరో చెక్కినట్లు చక్కని ముక్కు, చివరన ఓ చిన్న



రతనాల నక్షత్రం... ఎవరికో దారి చూపుతూ... నిండైన పెదవులు... చిన్ని నోరు!

సన్నగా మారిన చుబుకం- మధ్యలో చిన్ని గుంట, ఎవరో చిలిపిగా నొక్కినట్లు-

ఆ బుగ్గలు, కనీసం వెలుగు కూడా నిలవని నునుపు! నల్లని కురులు కప్పుకుంటూ పల్చని చెవులు- బుట్టలోలకులు ఊగుతూ- నిశ్శబ్ద శృంగార ఘంటికలు మోగిస్తూ-

ఎప్పుడైనా గోరింటాకు మెరిసే పొడవైన మునివేళ్లు- కళ్యాణపుటుంగరం!

ఏవో స్వర్గాలు దాచినట్లు అరచేతులు-

అపుడపుడు కనపడే బంగారు పట్టాలు- సన్నని మువ్వల్తో మట్టెల మోతలు!

(ఎవరీమె? ఏ లోకపు దేవత? ఏ శాపంతో ఇక్కడకు వచ్చింది?)

తారక్క నన్ను పరిచయం చేసింది.

అప్పుడే చిన్నత్త కనుల్లోకి చూశాను. ఏవో రహస్యపు లోకాలు, అనంత మర్మాలు దాస్తున్నట్లు అరమోడ్పు కనులు- ఎక్కడో నిద్రపోయి ఇక్కడ మేల్కొన్నట్లు, బరువుగా వాలుతున్న నీలపు రెప్పలు- తన లోకంలోకి రమ్మని చిరునవ్వు స్వాగతం!

** ** **

నరసయ్య మామది పెద్ద పెంకుటిల్లు-

ముందు వెనక పెద్ద దొడ్డి-

ఎప్పుడూ సున్నాలతో కళకళలాడుతుంటుంది!

ముందు మందార చెట్టు- మల్లెపందిరి

పెరట్లో పెద్ద రోలు- పొగడ చెట్టు- కొబ్బరి చెట్లు. బయటే చిన్న వంటిల్లు- ముందు వరండా దాటగానే హాలు. పక్కనే చిన్న గది.

వెనుకనే పెద్ద పడక గది!

ఆ గదికి బరువైన ఒంటరి తలుపు- ఇత్తడి గుబ్బలు- వాకిలికి- పూసల తెర- రంగు రంగుల పూసలు ఊగుతూ- మోగుతూ!

లోపల పందిరి మంచం- రోజ్‌వుడ్ రంగుతో చుట్టూ చిన్నచిన్న చిలకలు- తల దగ్గర పెద్ద అద్దం తిరుగుతూ... మాయలాంటి తెర!

బూరుగ దూది పరుపు- మెత్తమెత్తని మబ్బుల్లాంటి తలగడలు- శాటిన్ కవర్లు. పట్టు దుప్పట్లు... ఏదో మైకంలాంటి మత్తైన వాసనలు.

మంచం ఎక్కటానికి చక్కగా చెక్కిన ఎత్తు పీట!

గుండ్రని నగిషి మంచపు కోళ్లు...

గోడకు చిన్న అలమర- పక్కనే దీపపు గూడు! అక్కడే కోడిగుడ్డు దీపం! అస్పష్టమైన బొమ్మలతో ఒక ఆయిల్ పెయింటింగ్ పక్కనే వెంకట్రామా అండ్‌కో కేలెండరు. మార్చి- పందొమ్మిది వందల యాభై ఎనిమిది.

** ** **

కుక్కపిల్ల గ్రామఫోను రికార్డులు వినేవాళ్లం, పిన్నులు పెట్టడం, కీ ఇవ్వటం రికార్డు తిరుగుతుంటే వెలుగు ఊగిసలాడుతుంటే పాటలు బైటకు వస్తుంటే అదొక వింత లోకంలో వున్నట్లు గడిచేది! ఆమెతో ఉన్నంతసేపు...

చిన్నత్త కొత్తగా కాపురానికి వచ్చిన స్నిగ్ధ! కదులుతున్న శృంగారం, ప్రేమతో దగ్గరకు తీసుకొని, ఆకలి, దప్పిక తీర్చే ప్రేమ దేవత...

ఎప్పుడైన మధ్యాహ్నం వెళ్లినప్పుడు ఆ పందిరి మంచం మీద నిద్రపోతున్న రతీదేవిగా అన్పించేది...

"చిన్నత్తా... దేవతలుంటారా? కథల్లో మాదిరి ఎప్పుడైనా మన మధ్యకు, ఈ భూమ్మీదకు దిగి వస్తారా? నువ్వు అలాగే వచ్చావా...?"

అడిగేవాణ్ణి...

"నువ్వు ఇక్కడకు ఎలా వచ్చావు?" అడిగా మళ్లీ.

"అదుగో కాలవ! పడవ మీద, తెరచాప పడవ మీద, కాలవ ప్రవాహంలో ఒకరోజు-

ఒక పగలు, కాలవ గట్లు, ఎండలో వళ్లు ఎండబెట్టుకుంటున్నాయి. గట్ల మీద గడ్డి మేస్తూ గేదెలు, పరుగులు పెడుతూ మేకలు.

తెరచాప నిండా గాలి-

సరంగు పాటలు- పగలంతా, మెల్లగా, బద్ధకంగా ప్రయాణం. రాత్రి, సగం చంద్రుడు, కోటి చుక్కలు... ఆగిపోయిన గాలి, దిగిపోయిన తెరచాప, పడవ లాగుతూ సరంగులు- పాటలు పాడుతూ సరంగులు, రాత్రంతా...

తెలతెలవారుతుండగా ఈ ఊరి రేవులో ఆగింది పడవ... మెట్ల బల్ల పసుపు పూసి వేశారు. గట్టుమీదకు దిగుతుండగా ముత్తయిదువులు దిష్టి నీళ్లు-

ఆ రోజే ఈ ఇంట్లో అడుగుపెట్టా...!!"

స్వగతంలా చెప్పింది...

"నువ్వు- ఎక్కడికీ వెళ్లవా"? అడిగా...

"అయినా ఎక్కడికి వెళ్లాలి?"

"ఎన్నో పగుళ్లు, కలలు కన్నాను, ఏ రాకుమారుడో వస్తాడని"...

ఆపైన ఆమె చెప్పలేదు.

ఇప్పుడు నరసయ్య మామ బలమైన చేతుల్లో- లంక పొగాకు ఘాటైన వాసనల్లో ఏవో పీడకలలు-

కలల్లోంచి పీడ కలల్లోకి మేల్కొని- తెల్లవారగా వళ్లంతా పచ్చి పుండు- వేడినీళ్ల స్నానం- సాంబ్రాణి ధూపం- తలార బెట్టుకుంటూ,

ఆ పొగల వెనుక నుంచి ఆకురుల మధ్య నుంచి...

మబ్బుల్లో చందమామలా ఉండేది- అప్పుడే నే వెళ్లేది!

పొగల తెరల్లోంచి- వత్తైన కురుల్లోంచి, మత్తు కనుల్తో వాలిపోతున్న రెప్పల రహస్యపు లోకాల లోంచి- చూస్తూ పిలిచేది-

"రా..." అంటూ నాకేదో తెలియని ఆకర్షణ, చెప్పలేని ఆరాధన!

ఈ దేవతను ఎలా కొలవాలి?

ఎర్రమందారం పూలు కోసి ఇచ్చా!

వెడల్పాటి రేకుల మధ్యలో పుప్పొడి అలవోకగా బుగ్గలకు అలదుకుంటూ-

"ఇవ్వాళ ఎక్కడకు వెళ్లావు..." అనేది!

"పొద్దున వంతెన దగ్గరకు వెళ్లా- సరుకుల కోసం. నాట్లు మొదలుపెడుతున్నారు... పదిహేనురోజుల పొలం పని.

నిలవ కూలీలు- వచ్చారు. చెరువు దగ్గర దొడ్లో పెట్టారు.

రేపే మా ఊడుపు! మీకు చాలా పొలం ఉందిగా...

మామ చెప్పలేదా?"

"ఆ ఇప్పుడే తెలుస్తున్నాయి..."

తర్వాత వెళ్లేటప్పుడు... "వెళ్లొస్తానత్తా..." అన్నప్పు డు సున్నుండలు పెట్టింది- మత్తైన నేతి వాసన!

తర్వాత చేను దమ్ము చేయటం, నిండా నీరు పెట్టడం, గట్లు వేయటం, నారు మోయటం.

దున్నలతో బల్లలాగటం, చేను చదును చేయటం ఆడకూలీలు, తుమ్మెద పాటలు పాడుతూ నాట్లు వేస్తుంటే నారు అందీయటం-

ఊడుపులు అయ్యేవరకూ ఊపిరాడేది కాదు-

** ** **

ఎప్పుడైనా తీరిక ఉంటే, సాయంత్రం కాలవ గట్టుకు నేను, చిన్నత్త వెళ్లే వాళ్లం- తారక్క అప్పుడపుడు వచ్చేది...

దారిలో పెద్ద మర్రిచెట్టు, బలంగా ఊడలు దిగి కాళ్ల కింద ఆకులు, ఒకోసారి మెత్తగా, ఒకోసారి గలగలలాడుతూ- గట్టు మీద కూర్చొని- వాలే పొద్దుని చూస్తూ ఉండిపోయేది.

అంతలో రాదారి పడవ చిరుగుల- తెరచాపనిండా గాలితో బరువుగా వయ్యారంగా వస్తుండేది-

మెల్లగా మమ్మల్ని దాటి, దిగువకు వెళ్లిపోయేది, "ఎక్కడికి పోతున్నాయి ఈ పడవలు...?" అనేది. దిగంతంలో పొద్దు దిగిపోతుంటే ఎంత వింతగా ఉండేది!

చిన్నత్త, ఆమె కిష్టమైన పనులు ఎంతో తేలిగ్గా చేసేది- ఎప్పుడూ అలసినట్లు కనపడేది కాదు.

ఊడుపులు అయిన తర్వాత యూరియా వేశాం- చేను ముదురుపచ్చగా మారి ఆరోగ్యంగా ఉంది!

నేను త్వరలోనే గుడివాడ వెళ్లిపోయాను- డిగ్రీలో చేరేందుకు.

** ** **

వినాయకచవితికి వచ్చినపుడు, చిన్నత్తను చూసేందుకు వెళ్లా. పెరట్లో ఒకరకమైన గ్రేస్‌తో నడుస్తోంది. అప్పటికి చూలాలు! ముఖం అంతా వింత మెరుపుతో వెలిగిపోతోంది.

పొగడపూల చెట్టు కింద, నవారు మంచం మీద కూర్చొని ఏదో దండ గుచ్చుతోంది... సన్నగా పాడుతూ...! మంచం అంచున కూర్చున్నా...

నన్ను చూసి చిన్నగా నవ్వింది... "ఎలా ఉన్నావు...?"

నా గుండెల్లో ఏదో బరువు తెలియని దిగులు.

ఈ దేవత మనిషై పోతున్నట్లు- మనుషుల్లో ఒకటై పోతున్నట్లు చెప్పలేని బాధ- నాకు.

ఆమె ఏదో బాధ్యత కోసం వచ్చినట్లు ఏ కంప్లైంటు లేకుండా తన పని- తన శాపం అనుభవిస్తున్నట్లు నిర్లిప్తంగా... అనిపించేది నాకు!



కనుల కింద చీకటి చేరింది.
ఒకపుడు వెలుగే నిలవని బుగ్గలు ఇప్పుడు చీకటి గూళ్లయినాయి.
అయ్యో. ఈ పారిజాతానికి బురద అంటుతుందా?
ఈ వెన్నెలకు బూజుపడుతుందా?
ఈ దేవత మనిషిగా. మట్టిగా మారిపోతుందా?

వారం రోజులు అప్పుడు, చేలలో కలుపుతీసి, నీరు మార్చే వాళ్లం. చేను రెండడుగులు పెరిగి గాలికి తలల్లు అలలుగా మారుతుండేది.

అక్కడక్కడా తెల్లని పిట్టలు వాలి నీళ్లలో పురుగులు తింటుండేవి.

పెద్ద గట్ల మీద దోసపాదులు పెట్టాం. మళ్లీ నేను కొద్ది రోజులు శలవలకు వచ్చేసరికి-

ఆ ఇంట్లోనే ఒక మిడ్‌వైఫ్ సాయంతో మగపిల్లవాణ్ణి కన్నది.

ఆ తర్వాత బాలింతరాలిగా తలకు, చెవులకు గుడ్డ కట్టుకుని తిరుగుతున్న చిన్నత్తను చూశాను.

కాని ఆమెలో తన్మయత్వం ఏది- ఇవన్ని తన బాధ్యతలేనా? శాపంలో భాగాలేనా?

ఈమె తల్లి తరఫు వాళ్లెవరూ రాలేదే? ఎవరూ లేరా?

ఎక్కువసేపు నేనూ.... తారక్క. ఆమెతోనే ఉండే వాళ్లం.

బాబుని ఎత్తుకుంటానికి ఇచ్చేది...

నాకేదో వింత ఆనందం- ఆ పసిగుడ్డును పొదివి పట్టుకుంటూ, ఆ లేత స్పర్శకు- ఆమెత్తని పొత్తిళ్ల- జాన్సన్ బేబి పౌడరు పసివాసన నాకెంతో హాయిగా ఉండేది. బాబు అరచేతులు అరికాళ్లు- బుగ్గలు- నాముఖానికి అద్దుకుని ఆనందిస్తుంటే- చూస్తూ ఉండిపోయేది... వాడి నవ్వు నాకెంతో అబ్బురంగా ఉండేది!

నరసయ్య మామకు కలిగిన ఆనందానికి అంతు లేదు! ఊరంతా పండగ చేశాడు- తర్వాత ఉయ్యాల పండక్కు ఊరు, పక్క ఊరు అందర్నీ పిలిచాడు.

ఊళ్లో ఆడంగులకు ఈమె మీద ఏదో అసూయ ఉండేది. గర్విష్టి అని గుసగుసలు పోయేవారు.

అయినా ఉయ్యాలకు అందరూ వచ్చారు.

నాకు ఈ ఉయ్యాల కూడా చిన్న పందిరి మంచం లాగానే అన్పించింది.

అంతా నగిషిలతో, చిన్నతెరతో బొమ్మలతో- కొత్త వార్నిష్ వాసనతో- గిలకలతో- మీగడలాంటి గుడ్డలతో- వాడి బుల్లి గుప్పిట్లతో అపుడే వేసిన పులిగోరుతో- బంగారు మొలతాడుతో- అంతా సందడే- అంతా పండగే-

ఇంత సందడిలోనూ- మామూలుగా తన పని చేసుకుంటూ కన్పించింది చిన్నత్త. మరి కొంత శాపం తీరినట్లు అన్పించింది.

** ** **

వరిచేలు ఏపుగా పెరిగి గాలికి ఊగుతున్నాయి. ఇప్పుడిపుడే పొట్ట మీద కొస్తున్నాయి. పొలం చుట్టు తిరిగి, మావులు, బోదులు సరిచూసి, గొడ్లకి పచ్చి వరి కోసుకుని మోపు నెత్తిన పెట్టుకుని ఇంటికి వస్తుంటే చిన్నత్త చూసేది!

"అబ్బో! చాలా కష్టపడుతున్నావే!" అనేది.

"కాదులే అత్తా! కాలేజీలో చదవటం ఇంకా కష్టం!" అంటూ నవ్వే వాణ్ణి! తర్వాత వారంలో...

అప్పుడే నాకు ఆట్లమ్మ పోసింది. అరిటాకుల్లో చుట్టి, చాకలి పరగడపునే కల్లు తాగించాడు. తర్వాత వారం రోజులు జ్వరంతో మంచానపడ్డాను. నన్ను చూడ్డానికి చిన్నత్త వచ్చింది. నా మంచం మీద కూర్చోబోతే "వద్దత్తా! నీకు అంటుకుంటుందేమో..." అంటున్నా- పక్కనే కూర్చొంది.

నా గొంతులో వణుకు- కన్నుల్లో చీకటి చూసి కంట తడిపెట్టింది.

అయ్యో! దేవతలు ఏడుస్తారా?!

బాబాయి పోలేరమ్మకు పుంజును కోయించాడు! గణాచారి పూజ గడగడలాడించాడు. కాలేజీ పది రోజులు పోయింది!

** ** **

ఈసారి సంక్రాంతి సెలవులకు రాగానే ముందుగా చిన్నత్త దగ్గరకు పరిగెత్తాను. ఈ మధ్య నాకు రోజూ కల్లోకి వచ్చి కల్లోల పెడుతుంది. కనపడదేమోనని కలవరపెడుతోంది. అందుకే రాగానే పరుగెత్తాను. ఒక్కసారిగా చిన్నత్తను చూసి నిశ్చేష్టుడినయ్యాను. బరువుగా దిగులుగా నడుస్తోంది.

మిసమిసలాడే మేను వెలవెలపోతుంది.

కనుల కింద చీకటి చేరింది. ఒకపుడు వెలుగే నిలవని బుగ్గలు ఇప్పుడు చీకటి గూళ్లయినాయి. అయ్యో. ఈ పారిజాతానికి బురద అంటుతుందా?

ఈ వెన్నెలకు బూజుపడుతుందా?

ఈ దేవత మనిషిగా. మట్టిగా మారిపోతుందా? ఎంత దిగులు నాకు... ఎంత బరువు ఈ గుండెకు...

"అత్తా- ఇలా వున్నావేమిటి" నాకు ఏడుపే తక్కువ.

గచ్చుమీద గవ్వలు రాలినట్లు- నవ్వింది...

"నాకేంరా, పిచ్చీ..." అని దగ్గరకు తీసుకుంది.

పెరడంతా బంతి పూలవాసనతో, గొబ్బిళ్లతో వింతగా ఉంది.

నరసయ్యమామ, కొడుకుని పెద్ద పెళ్లానికి పెంపకానికి ఇచ్చాడు. పక్క ఊళ్లోనే.

అప్పుడు కూడా. ఏమీ నిరసన చెయ్యలేదు.

నిర్లిప్తంగానే ఉండిపోయింది.

మరికొంత విముక్తి జరిగినట్లుగానేమో...

** ** **

సంక్రాంతికి ముందు-

కుప్పలు తీశాం-

ఎడ్లు- దున్నలతో నూర్పిడి మొదలుపెట్టాం- పగలంతా గడ్డిలో వడ్లు తూర్పార బట్టటంలో వళ్లు పులిసిపోయేది! పదిమందితో పని- సరదాగా ఆటగా అయిపోతుండేది. పొద్దువాలే సమయానికి ఎడ్లు తోలుకుని ఇంటికి చేరేవాణ్ణి- వేణ్నీళ్లు పిన్ని సిద్ధంగా ఉంచేది. ఉడికిన ఉలవలు కమ్మని వాసన!

స్నానం చేసి మీగడ పెరుగుతో అన్నం తిని-

తారక్కతో చిన్నత్త దగ్గరకు వెళ్లేవాణ్ణి-

బయట చలిగా- చల్లగా- మంచుపడుతుండేది.

నా చేతిలో కర్ర. తలగుడ్డ. గొంగళి చూసి ఎక్కడికెళ్తున్నావు అడిగేది!

"కుప్ప దగ్గరకు కాపలా" అంటే .

"ఏమిటి... నువ్వు కాపలానా?" అంటూ నవ్వేది!

నత్తి ! నత్తి !!
నత్తికి ప్రత్యేక చికిత్సకై సంప్రదించండి.
హిప్నో హెల్త్ క్లబ్ 9, పెదవాల్తేరు జంక్షన్, విశాఖపట్నం.
ఫోన్స్ : 0891-721543, 532926
HYD © 4026675 KAKINADA © 0884-362819,
సెల్ నెం. 98481 - 90302

"భయం వెయ్యదా..."

"చిన్నత్తా... ఇప్పుడు మీసాలున్న మొగవాణ్ణి" అని గర్వంగా చెప్పాలని అన్పించేది.

ఇలా అనుకుంటూ చిన్నత్తను చూస్తున్నపుడు. నా అంతరంగంలో చెప్పలేని అలజడి రేగేది- అంతుబట్టని దిగులు ఆవహించేది.

"అంతా బడాయి. మా పెద పాలేరు కూడా వెళ్తాడు తోడు"

అంటూ తారక్క నవ్వేది!

తలగుడ్డ సరిచేసుకుని మెడలో మఫ్లరు వేసుకుని చేతికర్ర తిప్పుకుంటూ కుప్పలున్న చేలోకి గట్టు మీద మోళ్ల మీద నడుచుకుంటూ చేరేవాణ్ణి.

అప్పటికే వెన్నెల వచ్చేది-

కావలాకి ఇక్కడ మంచెలుండవు- బండి వాల్చి- చక్రాలకు గడ్డి గుచ్చి-పైన గడ్డిమోపులు వేసి- బండి కింద కూర్చునేందుకు వెచ్చగా గడ్డి మీద ఈతాకు చాప- దుప్పటి వేసేవాళ్లు- లాంతరు మసిబారుతా- ఉండేది పెద్దపాలేరు- కుప్పలో దూరి నిద్రపోయేవాడు. బండి కింద వెచ్చగా గొంగట్లో- కూర్చొని చూస్తుంటే వెన్నెల మంచులో తడుస్తుండేది. కట్లూడదీసుకున్న గొడ్లు మోళ్లు మేస్తూ దెయ్యాలా కదుల్తుండేవి!

రాని దొంగల కోసం- వచ్చే నిద్ర ఆపుకుంటూ భయం పోవటానికి గట్టిగా సినిమా పాటలు పాడుతూ- పక్కచేలో కుప్ప దగ్గర కావలా వాణ్ణి కేకలు వేస్తూ ఎప్పుడో నిద్రపోయేవాణ్ణి!

నిద్రలో చిన్నత్త నవ్వుతూ కనిపించేది.

దగ్గరకు వచ్చి వళ్లో నా తల చేర్చి తోడుండేది!

నా కలల్లో తను వచ్చి కలవరపెట్టేది.

తొలికోడికే మెలకువ వచ్చేది.

తొలి వెలుగులో ఇంటికి చేరేవాణ్ణి!

పిన్ని- అప్పుడే పితికిన గుమ్మపాలు ఇచ్చేది!

** ** **

ధాన్యం కొనటానికి గుడివాడ వడ్ల బ్రోకరు వచ్చేవాడు. రోజుకో ధర చెప్పేవాడు. ఇవ్వక తప్పదు.

వాడే సంచులు పంపేవాడు. రామాలయం దగ్గర లారీ పెట్టేవాడు.

అక్కడవరకూ బండ్లమీద బస్తాలు తోలాలి. బస్తాల కాటా వేసేటప్పుడు తడి వడ్లని ఎక్కువవేసేవాడు.

మాకు వాడు లేకవాడి లాంటి బ్రోకర్ తప్ప- అమ్మే దారి లేదు.

సగం డబ్బు చేతిలో పెట్టి-

"పదిహేను రోజుల్లో మిల్లు నుంచి డబ్బు తెచ్చియిస్తా నన్నయ్యా" బాబాయితో చెప్పి వెళ్లిపోయేవాడు. మళ్లీ ఆర్నెల్ల లోపు కనపడేవాడు కాదు బాబాయి ఆ డబ్బు జాగ్రత్తగా- పడక గదిపైన గూటిలో దాచేవాడు. దాయటానికి బీరువా ఉండదు. బ్యాంకులేదు!

సంవత్సరంఅంతా ఆడబ్బే వాడుకోవాలి. మళ్లీ వ్యవసాయపు పనులకు పెట్టుబడి పెట్టాలి. అయినా రోజులు ఒడిదుడుకులు, ఒత్తిడులు లేకుండా నడుస్తుండేవి.

భోగిమంటలు వేశాం-

పంచ బిగించి- తడి మంచులో చెడుగుడూ ఆడాం!

నవంబరులోనే తారక్కకు పెళ్లయింది.

సంక్రాంతి అవగానే అత్తారింటికి వెళ్లిపోయింది. నేనూ కాలేజీ తెరిచేసరికి పట్నం వెళ్లిపోవాలి.

ఒంటరిగా కాలవ గట్టుమీద నడిచి వంతెన దగ్గరకు చేరి అక్కడ బస్సెక్కి వెళ్లాలి.

కాలవ నిండుగా ప్రవహిస్తోంది. ఈ సంవత్సరం దాళవా ఉంది. తెరచాప పడవలు మందంగా బరువుగా కదులుతున్నాయి.

కడుపులో కొబ్బరికాయలు- సరుకులు దాచుకుని.

ఇంకా మామిడి పూయలేదు-

కోయిల కూయనూ లేదు-


** ** **

వేసవి సెలవులకు వస్తున్నపుడు, గుడివాడలో పిన్నికి మందులు కొన్నాను. ఆఖరి బస్సు చాలా ఆలస్యంగా నన్ను వంతెన దగ్గర దింపి కదిలిపోయింది. చూస్తుండగానే వెనక ఎర్రటి దీపాలు కనుమరుగైపోయాయి. అంతా చీకటి- చిమ్మచీకటి...

తడుముకుంటూ వాలు దిగాను గట్టు మీదకు కాలవలో నీళ్లు సగానికే నడుస్తున్నాయి. నీట నడక వినపడుతోంది- చీకటి! అంతా చీకటి- దట్టంగా కమ్ముకున్న మామిడిచెట్లు, గట్టు ఎత్తు పల్లాలు- కీచురాళ్లు గోల పెడుతున్నాయి.

చుక్కల మినుకు చెట్లపైనే ఆగిపోతోంది.

కటిక చీకటి, కన్ను తెరిచినా మూసినా ఒక్కలాగానే వుంది- తెలిసినదారే- అయినా తడబాటు! గుండె దడ- అడుగులో అడుగు; గొంతులో వణుకు రాగం- భయాన్ని తోలటానికి ఈలపాట- ఇలా ఎంత దూరం- ఎంత సేపు గడిచింది?



ఎక్కడని పిలవాలి? ఎవరిని అడగాలి? మెల్లగా కాలవగట్టుకు వెళ్లాను. నీళ్లు మెల్లగా తగ్గిపోతున్నాయి. రేపటి నుంచీ పడవలు రావు. కాలవకు రెండు పక్కలా బారునే చూశాను. ఎండలో మామిడి చెట్లు కాయలతో బరువెక్కుతున్నాయి. కనపడే వరకు ఎక్కడ పడవ జాడలేదు- ఈరోజు బల్లకట్టు కూడా వెళ్లిపోయింది. కాసేపు గట్టుమీద కూర్చున్నా... ఒక్కసారిగా ఒంటరినైపోయినట్లు నాలో దుఃఖం పొంగుకొస్తోంది.

ఇంతలో వెనక నుంచి ఏదో శబ్దం- ఏమిటి? పాములు కదులుతున్నాయా? దెయ్యాల మీద నుంచి చెట్లు దిగుతున్నాయా?

భయం గుప్పెట్లో- గుండె దడదడ.

వెనక నుంచి ఓ తెరచాప పడవ మెల్లగా వస్తోంది. వడ్డు అంచుకు దగ్గర చేరుతోంది- చూశాను.

గమ్మత్తుగా చుక్కాని దగ్గర లాంతరు వేలాడదీసి ఉంది. ఆ వెలుగులోనే చిన్నత్త నిలబడి ఉంది. కన్నులు నులుముకుని మళ్లీ చూశాను. "పిచ్చీ... రా..." అంటూ పిలిచింది ఇక్కడ రేవు లేదు. వడిగా నడిచి పడవలో దుకాలి. చేయందించింది- అప్పుడే దగ్గరగా చూశాను.

"ఎక్కడనుంచీ..."

** ** **

వెన్నెల్లాంటి చీర- చీకటిలో కూడా కనపడుతోంది తలనిండా మల్లెపూలు-

మత్తుగా వాసన...

చుక్కలు దాక్కున్న కనుపాపలు...

నా చేయి ఆమె అరచేతిలోనే వుంది.

గులాబీలు మెత్తదనం- ఆమె నవ్వుతూనే ఉంది.

** ** **

ఊరు దగ్గరయింది- రేవు పక్కనైంది.

ముందుగా నేను దూకాను, "జాగ్రత్త సుమా.."

వెనకనుంచి అంటోంది... "చిన్నత్తా..." అంటున్నా-

పడవ సాగిపోతోంది- "నువ్వు దిగవా?"

నవ్వుతోంది. వెళ్లిపోతోంది. పడవ వెళ్లిపోతోంది.

** ** **

ఇసక దారిలో ఊర కుక్కలు నిద్దరోతున్నాయి. గొడ్ల ఉచ్చలో తడిసి ఇసక ఏదో వాసన వేస్తోంది. నిద్రలో నడుస్తున్నట్లు ఊళ్లోకి- ఇంటికి చేరాను.

పిన్నికి- అమృతాంజనం- మందులు ఇచ్చాను.

"అన్నం తిందువురా..." అంటోంది పిన్ని...

ఎక్కడో ఓ నక్క ఊళ వేస్తోంది-

అంతా నిశ్శబ్దంగా- సద్దుమణిగి- నిద్దరోతోంది- వూరు.

దొడ్లో ఎద్దుల గంటలు మూగపోయాయి.

దూరంగా పెద్ద మర్రిచెట్టు దెయ్యంలా నిలబడి వుంది. గుడ్లగూబల్ని- గబ్బిలాల్ని తల్లో దాచుకుని-

ఊరి చుట్టూ తాడిచెట్లు నిలబడి కునికిపాట్లు పడుతున్నాయి.

ఊళ్లో గాలంతా తెరచాప ఎక్కి ఎక్కడికో వెళ్లిపోయింది. ఉక్కగా- చెమటగా నిద్రపట్టలేదు.

** ** **

తెలతెలవారుతుండగా ఎద్దుల గంటలు వినపడుతున్నాయి.

నాగళ్లు తిరగగట్టి ఆకుమళ్లు దున్నటానికి వెళ్తున్నారు.

కళ్లాపి పేడవాసన వస్తోంది- కాకులు అరవటం మొదలుపెట్టాయి-

పిచ్చుకలు కంకుల కోసం వాలుతున్నాయి. చూస్తుండగానే భళ్లున తెల్లారింది.

** ** **

పొద్దెక్కిన తర్వాత నరసయ్య మామ ఇంటికి బయలుదేరాను.

పిన్ని మామిడి ఊరగాయపడుతోంది.

నలుగురి సాయంతో కారం- ఆవపిండి- వెల్లుల్లి మామిడి ముక్కలు ఎంతటి కమ్మని వాసన... నోరూరే వాసన- ఊరగాయ అన్నంలో కలిపి ముద్దలు తిని ఎలా ఉందో చెప్పాలి ఉప్పు- సరిపోయిందా ఇంకో ముద్ద- ఎర్రగా రుచిగా మంటగా, కమ్మగా... నేను రెండు ముద్దలు తిని- ఒక ముద్ద గుప్పిట్లో దాచుకుని- చిన్నత్త ఇంటికి వెళ్లాను.

నరసయ్య మామ వీధిలో అరుగుమీద కూర్చొని చుట్ట తాగుతున్నాడు. పాలేళ్ళ మీద మెత్తగా పెత్తనం చేస్తున్నాడు- ఏదో హడావుడి పడుతున్నారు.

నోట్లో చుట్టతో, చుట్టూ పాలేళ్లతో- బలంగా ఊడలు దిగిన మర్రిచెట్టులా ఉన్నాడు!

నేను లోనికి వెళ్లాను. అలికిడి లేదు-

నిద్రపోతోందేమో, పందిరి మంచం చూశాను- దుప్పటి కూడా నలగలేదు.

పెరట్లో పొగడపూల చెట్టు కింద కూడా లేదు-

చిన్నపాటు వణుకుతో 'చిన్నత్తా' అన్నాను- ఎవరూ పలకలేదు.

గుప్పిట్లో అన్నం ముద్ద- కొత్త పచ్చడి కలిపిన అన్నం ముద్ద, బరువుగా ఉంది.

ఎక్కడని పిలవాలి? ఎవరిని అడగాలి? మెల్లగా కాలవగట్టుకు వెళ్లాను. నీళ్లు మెల్లగా తగ్గిపోతున్నాయి. రేపటి నుంచీ పడవలు రావు. కాలవకు రెండు పక్కలా బారునే చూశాను. ఎండలో మామిడి చెట్లు కాయలతో బరువెక్కుతున్నాయి. కనపడే వరకు ఎక్కడ పడవ జాడలేదు- ఈరోజు బల్లకట్టు కూడా వెళ్లిపోయింది. కాసేపు గట్టుమీద కూర్చున్నా... ఒక్కసారిగా ఒంటరినైపోయినట్లు నాలో దుఃఖం పొంగుకొస్తోంది. గుప్పెట్లో కొత్త పచ్చడి అన్నం ముద్ద... మెల్లగా నీళ్లలోకి వదిలేశా...

దేవత శాపం తీరిపోయిందేమో?

** ** **

ఆ రాత్రి బైట నులకమంచం మీద పడుకున్నా. చుక్కలాకాశం బిక్కుబిక్కుమంటోంది. ఎన్ని చుక్కలో- చిన్నత్త ఆలోచనలతో నిద్రపట్టలేదు. ●